JAYABHERIDAILY.COM

ప్రభాత **జయభేరి**

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి | ఆదివారం 31-05-2026

Medchal - Malkajgiri | Sunday 31-05-2026

Follow: jayabherinews

సంపుటి : 02 | సంచిక : 353

పేజీలు : 8 | వెల : 5

Vol. 02 | Issue 365 | Pages : 8 | ₹: 5

**విలేకర్లు కావలెను**

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889 call me

jayabheripaper@gmail.com



# విశ్వ గురువు అంటారు

- ఒక్క ఎగ్జామ్ సరిగ్గా నిర్వహించడం చేతకాదు
- UET UG జాప్యంపై రాహుల్ గాంధీ



**జయభేరి, న్యూఢిల్లీ:**

దేశ వ్యాప్తంగా నేడు పలు కేంద్రాల్లో కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్‌యుజి (CUETUG 2026) ఎగ్జామ్ ఆలస్యం కావడంపై తీవ్ర దుమారం రేగింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) దీనిని టెక్నికల్ ప్రాబ్లమ్ అని పేర్కొంది. ఈ కారణంతో ఎగ్జామ్ చాలా సెంటర్లలో కొంత ఆలస్యంగా ప్రారంభమైంది. నీట్ యూజీ పేపర్ లీక్ ఆరోపణల తో ఎగ్జామ్ రద్దు చేయగా, తాజాగా సీయూఈజీ యూజీ ఎగ్జామ్ నిర్వహణలో లోపాలపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. విశ్వగురుగా చెప్పుకుంటారు. కానీ ఒక్క ఎగ్జామ్ కూడా సరిగ్గా నిర్వహించడానికి చేతకాదంటూ ఎన్డీయే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. "NEET, CBSE, SSC, ఈరోజు CUET యూజీ. నాలుగు పరీక్షలు. ఒక కోటి మంది విద్యార్థుల భవిష్యత్.

...మిగతాది 2 లో

# చెత్త నుంచి విద్యుత్తు

- డంపింగ్ యార్డ్ లేని ఏపీ - పల్నాడులో పవన్ కళ్యాణ్ పర్యావరణ మంత్రం
- కాలుష్య రహిత గోదావరి పుష్కరాలకు భారీ ప్లాన్
- సింగపూర్, ఇండోర్ మోడల్స్‌పై అధ్యయనం
- యువతకు ఉపాధి.. పంచాయతీలకు ఆదాయం



**జయభేరి, పల్నాడు జిల్లా :**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యావరణ పరిరక్షణ , స్వచ్ఛత దిశగా సరికొత్త అడుగులు వేస్తున్నారు. శనివారం పల్నాడు జిల్లా కొండవీడులోని జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్‌ను సందర్శించిన ఆయన, చెత్త నుంచి సంపదను సృష్టించడమే లక్ష్యంగా ప్రభుత్వ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. ముఖ్యంగా రాబోయే గోదావరి పుష్కరాలను కాలుష్య రహితంగా నిర్వహించడంతో పాటు, రాష్ట్రాన్ని డంపింగ్ యార్డ్ రహిత ఏపీగా తీర్చిదిద్దడమే తన ఆశయమని ఆయన స్పష్టం చేశారు. "చెత్త అనేది వ్యర్థం కాదు.. అది విద్యుత్తును ఇచ్చే ఇంధన ప్రత్యామ్నాయం" అని

...మిగతాది 2 లో

# నిప్పుల కొలిమిలా తెలంగాణ



**జయభేరి, హైదరాబాద్, మే 30 :**

తెలంగాణ రాష్ట్రంలో ఎండ తీవ్రత పీక్ స్టేజ్‌కు చేరింది. పది జిల్లాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండగా.. వడదెబ్బ కారణంగా శుక్రవారం ఒక్కరోజే వివిధ జిల్లాల్లో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఆసిఫాబాద్ జిల్లా దహేగాంలో అత్యధికంగా 46.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోని 46 మండలాల్లో తీవ్రమైన వడగాలులు వీస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు ఈ వడగాలుల తీవ్రత కొనసాగుతుందని.. అయితే ఆదివారం నుంచి రాష్ట్రంలోని

...మిగతాది 2 లో




## కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు ఇస్తామని

# దగా చేసిన కాంగ్రెస్

- చిన్న కాంట్రాక్టర్లకి ఇచ్చిన నిధులు, టెండర్లపై శ్వేతపత్రం కోసం డిమాండ్
- చిన్న కాంట్రాక్టర్లను రోడ్డుపైకి తెచ్చిన ఈ జీవో 17 రద్దయ్యే వరకు, బడుగు బలహీన వర్గాలకు కాంట్రాక్టులు దక్కే వరకు పోరాటం ఆపేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.
- రేవంత్ రెడ్డి ఒక 'రెన్యూవల్ సీఎం' మాత్రమే
- కేసీఆర్ హయాంలో సంపద సృష్టి - అద్భుత ప్రగతి
- 2028లో మన ప్రభుత్వమే వస్తుంది - 50 వేల మందిని కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దుతాం

**జయభేరి, హైదరాబాద్ :**

ఇందిరాపార్కు వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (JAC) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికలకు ముందు 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలు, 420 హామీలతో మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్.. అధికారం లోకి వచ్చాక అన్ని వర్గాలను నట్టేట ముంచిందని ధ్వజమెత్తారు.

**కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు ఇస్తామని దగా చేసిన కాంగ్రెస్**

ఎన్నికల ముందు చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్ల పేరుతో ప్రభుత్వ కాంట్రాక్టులలో ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 12 శాతం, బీసీలకు 42 శాతం (మొత్తం 72 శాతం) రిజర్వేషన్లు ఇస్తామని నమ్మబలికారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ అధికారం లోకి వచ్చాక 72 శాతం కాదు గదా, 72 పైసలు కూడా ఈ వర్గాలకు ఇవ్వకుండా అడ్డగోలు జీవోలను తెచ్చారని మండిపడ్డారు. చివరికి గురుకుల పాఠశాలల్లో స్థానిక చిన్న కాంట్రాక్టర్లు సరఫరా చేసే కూరగాయలు, చికెన్, పాలు, బ్రెడ్ వంటి వాటిని కూడా దక్కకుండా చేస్తూ 'జీవో నెం.17' (GO 17) తీసుకు వచ్చి, ఆ టెండర్లను పెద్ద కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. చిన్న కాంట్రాక్టర్లను రోడ్లపైకి తెచ్చిన ఈ జీవో 17 రద్దయ్యే వరకు, బడుగు బలహీన వర్గాలకు కాంట్రాక్టులు దక్కే వరకు పోరాటం ఆపేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

**చిన్న కాంట్రాక్టర్లకి ఇచ్చిన నిధులు, టెండర్లపై శ్వేతపత్రం కోసం డిమాండ్**

ఇవాళ రాష్ట్రంలో కాంట్రాక్టులు కేవలం ఇద్దరికే దక్కుతున్నాయని, రేవంత్ రెడ్డి బామ్మర్దికి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకుకే అన్ని కాంట్రాక్టులు ఇస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. సొంత నియోజకవర్గం కొడంగల్ నారాయణ పేట ఎత్తిపోతల పథకానికి సంబంధించిన రూ.4 వేల కోట్ల కాంట్రాక్టును తన అనుయాయులకే ఇచ్చుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో కేవలం వాళ్ల బంధువులకే కాకుండా, బీజేపీ ఎంపీ సీఎం రమేష్కు రూ.1300 కోట్ల కాంట్రాక్టులు ఇస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ఇప్పటివరకు రూ.4 లక్షల కోట్ల అప్పు చేశారని, అందులో రూ.4 అయినా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాంట్రాక్టర్లకు ఇచ్చారా అని ప్రశ్నించారు. చిన్న కాంట్రాక్టర్లకు విడుదల చేసిన నిధులు మరియు చేసిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము రేవంత్ సర్కార్కు ఉందా అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**రేవంత్ రెడ్డి ఒక 'రెన్యూవల్ సీఎం' మాత్రమే**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేమెంట్ కోటాలో గద్దెనెక్కారని, ఆయన ఒక రెగ్యులర్ సీఎం కాదని, కేవలం 'రెన్యూవల్ సీఎం' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

...మిగతాది 2 లో



## చెరువు అభివృద్ధి పేరుతో భారీ కుట్ర..

# బట్టబయలు చేసిన హైడ్రా!

- చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో గుడిసెలు వేయించి, ఆ భూమిని ఆక్రమించుకోవాలని చూసిన రియల్టర్ల వ్యూహానికి హైడ్రా చెక్
- ఏ ఒక్క అంగుళం భూమి కూడా అక్రమార్కుల పాలు కాకుండా పక్కాగా ఫెన్సింగ్ ఏర్పాటు

**జయభేరి, హైదరాబాద్, మే 30 :**

హైదరాబాద్ జలవనరుల పరిరక్షణే ధ్యేయంగా దూసుకుపోతున్న హైడ్రా మరో భారీ ఆపరేషన్‌తో సంచలనం సృష్టించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాల్‌గూడ నార్సింగి పరిధిలోని ముష్కిన్ చెరువు ఆక్రమణలపై శనివారం ఉక్కు పాదం మోపింది. సుమారు 5,500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడేందుకు హైడ్రా కమిషనర్ రంగంలోకి దిగి, చెరువు మధ్యలో నిర్మించిన అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు. ముష్కిన్ చెరువు పరిరక్షణ పేరుతో జరిగిన ఒక భారీ భూకబ్జా యత్నాన్ని హైడ్రా అధికారులు చాకచక్యంగా అడ్డుకున్నారు. ఒక ప్రముఖ నిర్మాణ

...మిగతాది 2 లో

## బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే

# బాల్క సుమన్ అరెస్టు



- సింగరేణిపై వివాదాస్పద వ్యాఖ్యల కేసులో చర్యలు

**జయభేరి, హైదరాబాద్, మే 30 :**

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక మలుపు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను నాంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు సమయంలో తెలంగాణ భవన్ కేంద్రంగా హైడ్రామా సాగింది. తీవ్ర ఉద్రిక్తత మధ్య ఆయన్ని నాంపల్లి పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సింగరేణిని తగలబెట్టాలని, మిలిటెంట్ యాక్టివిటీ చేయాలని చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం రేపాయి. దీంతో ఆయనపై పలు స్టేషన్స్‌లో కేసులు నమోదు అయ్యాయి. సింగరేణి బొగ్గు గని కార్మికుల సమావేశంలో బాల్క సుమన్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు ఆయన అరెస్టుకు దారి తీశాయి. సింగరేణిని తగులబెట్టండి... మిలిటెంట్ యాక్టివిటీ చేయాలి. డబ్బులు కావాలంటే ఆఫీస్‌లను తగలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కామెంట్స్‌పై ఆనంద్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా 326(g), 351(3), 353(1)(b), r/w 61(2)(a), BNS4 PDPPA వంటి కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మిలిటెంట్ వ్యాఖ్యలు చేసిన తర్వాత ఆయన అరెస్టు ఖాయమని ప్రచారం జరిగింది. దీంతో బాల్క సుమన్ గత మూడు రోజులుగా తెలంగాణ భవన్‌నే తన ఆవాసంగా మార్చుకున్నారు. ఆయన బయటకు రాగానే అరెస్టు చేయాలని పోలీసులు వ్యూహం రచించారు.

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## దగా చేసిన కాంగ్రెస్

ఢిల్లీ కాంగ్రెస్ హైకమాండ్కు నెలనెలా కప్పం (డబ్బులు) పంపి తన కుర్చీని కాపాడుకుంటున్నారని, ఢిల్లీకి బ్యాగులు మోసుకుంటూ పోయినన్ని రోజులు మాత్రమే ఆయన ఉద్యోగం ఉంటుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ బిడ్డలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా ఢిల్లీ హైకమాండ్ మౌనంగా ఉండటానికి ఇదే కారణమన్నారు. ఈ ద్రోహానికి రేవంత్ రెడ్డితో పాటు రాహుల్ గాంధీని, మల్లికార్జున ఖర్గేని కూడా నిలదీయాలని పిలుపునిచ్చారు.

**కేసీఆర్ హయాంలో సంపద సృష్టి - అద్భుత ప్రగతి**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ 'సంపద సృష్టించాలి-పేదలకు పంచాలి' అనే దృక్పథంతో పనిచేశారన్నారు. నాడు దిగ్గజ కాంట్రాక్టర్లను ఆదుకుని గౌరవంగా నిలబెట్టారని గుర్తు చేశారు. కేసీఆర్ అప్పులు చేసి 1000కి పైగా గురుకులాలు కట్టించి, 6.50 లక్షల మంది బడుగు విద్యార్థులకు ఒక్కొక్కరిపై రూ.1.20 లక్షల నుండి రూ.1.25 లక్షల వరకు ఖర్చు పెట్టి కార్పొరేట్ స్థాయి ఉచిత విద్య, బూట్లు, బట్టలు, నాణ్యమైన భోజనం అందించారని పేర్కొన్నారు. అప్పులతోనే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని, జిల్లాకో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ తెచ్చారని, 24 గంటల కరెంట్, కేసీఆర్ కిట్, 15 లక్షల మంది ఆడబిడ్డలకు మేనమామ కట్నంగా కల్యాణలక్ష్మి కింద ఆర్థిక సాయం అందించారని తెలిపారు. రైతులకు రూ.72 వేల కోట్ల రైతుబంధు సాయాన్ని నేరుగా ఖాతాల్లో వేశారని గుర్తు చేశారు. ముఖం బాగాలేక అద్దం పగలగొట్టుకున్న చందంగా... తాము చేతగాక కేసీఆర్ అప్పులు చేశారని రేవంత్ రెడ్డి అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. హద్దుమీరి మాట్లాడితే ఊరుకునేది లేదని, "తెలంగాణ తెచ్చిన మగోడు, మొనగాడు కేసీఆర్" అని కేటీఆర్ గర్వంగా ప్రకటించారు.

**2028లో మన ప్రభుత్వమే వస్తుంది - 50 వేల మందిని కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దుతాం**

రాష్ట్రంలో మక్కలు, వడ్లు కొనుగోలు కాక రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఇవాళ ఏ ఒక్క ఊరికైనా కాంగ్రెస్ వాళ్లు వెళ్లే ధైర్యం ఉందా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎలక్షన్లు ఎప్పుడు వస్తాయా, ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రుకాల్చి వాతపెట్టి, బొంద పెట్టాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. మైనర్ బాలికకు అన్యాయం జరిగితే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారు వదిలిపెట్టకుండా ఎట్లా పోరాడారో, బడుగుల సమస్యలపై కూడా అలాగే పోరాడతామన్నారు. బడుగు వర్గాల సమస్యలపై అధికారులకు, మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వాలని, ఒకవేళ వాళ్లు వినకపోతే భవిష్యత్తులో జంతర్ మంతర్ లేదా ఢిల్లీ వేదికగానైనా పోరాడుతామన్నారు. 2028లో తప్పకుండా మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని, నాడు 10 వేల మంది కాదు, దాదాపు 50 వేల మంది బడుగు, బలహీన వర్గాల యువకులను కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దే బాధ్యతను కేసీఆర్ తీసుకుంటారని కేటీఆర్ అభయమిచ్చారు.

## బాల్క సుమన్ అరెస్టు

భవన్ వెలుపల భారీగా పోలీసులు మోహరించారు. లోపల బీఆర్ఎస్ కార్యకర్తలు, లాయర్లు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీస్ గో బ్యాక్ అంటూ కార్యకర్తల నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తింది. నోటీసులు ఇవ్వకుండా ఎలా అరెస్టు చేస్తారని బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రశ్నించగా, నాన్‌బెయిలబుల్ కేసులు కాబట్టి నోటీసులు అవసరం లేదని పోలీసులు చెబుతున్నారు. అరెస్టుకు కొద్ది నిమిషాల ముందు బాల్క సుమన్ మీడియా ముందు తన గళాన్ని గట్టిగానే వినిపించారు. ప్రభుత్వం చేస్తున్న మోసాలను, సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలను ప్రశ్నిస్తున్నందుకు తనపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తనపై 250కిపైగా కేసులు ఉన్నాయని, జైలుకు వెళ్లడం తనకు కొత్త కాదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి కుట్రపూరితంగా తనను జైలుకు పంపి పైశాచికానందం పొందాలని చూస్తున్నారని విమర్శించారు. సింగరేణిలో వందల కోట్ల స్కాములు జరుగుతున్నాయని, వారసత్వ ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం మాట తప్పిందని ఆయన దుయ్యబట్టారు. ఉద్యమకారుడు ఎవరితో భయపడడు స్వచ్ఛందంగా నాంపల్లి పోలీసులకు లొంగిపోయిన పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు అత్యంత కఠినమైనవి. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి ప్రేరేపించడం వంటి సెక్షన్ల వల్ల పదేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉందని సమాచారం. బీఆర్ఎస్ లాయర్లు మాత్రం ఇవన్నీ అక్రమ కేసులని, బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు.

## బట్టబయలు చేసిన హైడ్రా!

సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల కింద చెరువును అభివృద్ధి చేస్తామంటూ ముందుకు వచ్చి, అసలు కథ నడిపింది. చెరువు మధ్యలో ఏకంగా ఒక ఆనకట్ట వంటి కట్టడాన్ని నిర్మించి, సుమారు 34.21 ఎకరాల జలవనరును ఆక్రమించుకునేందుకు ప్రయత్నించింది. నిబంధనలను తుంగలో తొక్కి సాగుతున్న ఈ నిర్మాణాలను గుర్తించిన హైడ్రా, వాటిని పూర్తిగా తొలగించి చెరువుకు పూర్వవైభవం తెచ్చే పనిలో పడింది. హెచ్ఎండిఏ లెక్కల ప్రకారం ముష్కిన్ చెరువు 52.20 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అయితే రెవెన్యూ రికార్డుల ప్రకారం ఇది 59.11 ఎకరాల వరకు ఉండగా, ఇందులో 20.23 ఎకరాలు ప్రభుత్వ భూమిగా ఉంది. ఈ భూమిపై కన్నేసిన రియల్టర్లు, పేదల పేరుతో అక్కడ గుడిసెలు వేయించి కబ్జాకు తెరలేపారు. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం ఈ భూమి విలువ అక్షరాలా 5,500 కోట్ల రూపాయలు. ఇంతటి భారీ విలువైన ప్రభుత్వ ఆస్తిని కాపాడేందుకు హైడ్రా శనివారం నుంచి చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసే పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించింది. చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో గుడిసెలు వేయించి, ఆ భూమిని ఆక్రమించుకోవాలని చూసిన రియల్టర్ల వ్యూహానికి హైడ్రా చెక్ పెట్టింది. అక్కడ నివసిస్తున్న వారికి గత రెండు నెలల క్రితమే నోటీసులు ఇచ్చి, ఖాళీ చేసేందుకు సమయం ఇచ్చింది. హైడ్రా హెచ్చరికలతో గుడిసెల్లోని వారు స్వచ్ఛందంగా ఖాళీ చేసి వెళ్లిపోవడంతో, అధికారులు శనివారం ఎలాంటి ఆటంకం లేకుండా క్లీన్ స్వీప్ చేశారు. చెరువు మధ్యలో పోసిన మట్టి కట్టలను, అక్రమంగా నిర్మించిన ఎంబ్యాంక్‌మెంట్‌ను జేసీబీలతో తొలగించి నీటి ప్రవాహానికి అడ్డులేకుండా చేశారు.చెరువు అభివృద్ధి పనులు చేపట్టిన సంస్థ పర్యావరణ నిబంధనలను ఘోరంగా ఉల్లంఘించినట్లు అధికారులు గుర్తించారు. చెరువు విస్తీర్ణాన్ని తగ్గించి, మిగిలిన భూమిని కమర్షియల్ ప్రయోజనాల కోసం వాడుకోవాలనే కుట్ర ఇందులో స్పష్టంగా కనిపిస్తోందని హైడ్రా వర్గాలు తెలిపాయి. ఎఫ్‌టిఎల్ సరిహద్దులను నిర్ణయించి, ఏ ఒక్క అంగుళం భూమి కూడా అక్రమార్కుల పాలు కాకుండా పక్కాగా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ భూమితో పాటు ఎక్సల్ పట్టా భూముల్లో జరుగుతున్న అక్రమ కట్టడాలపై కూడా హైడ్రా దృష్టి సారించింది.ముష్కిన్ చెరువు రక్షణ కోసం హైడ్రా చేపట్టిన ఈ భారీ ఆపరేషన్ రియల్ ఎస్టేట్ మాఫియాకు గట్టి హెచ్చరికగా మారింది. చెరువుల పునరుద్ధరణ పేరుతో భూములను మింగేయాలని చూస్తే పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో ఈ ఘటన నిరూపించింది. శనివారం రోజంతా సాగిన ఈ ఆపరేషన్‌తో గండిపేట పరిసర ప్రాంతాల్లో భూబకాసురుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. నగరంలోని మరిన్ని జలవనరులను కాపాడేందుకు హైడ్రా తన తదుపరి లక్ష్యాలను సిద్ధం చేసుకుంటోంది.

## మార్నింగ్ వాక్‌కు వెళ్లే మహిళలే లక్ష్యం

**● మత్తుకు బానిసై దోపిడీలకు పాల్పడిన ముఠా అరెస్ట్**

సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో మత్తుకు బానిసలైన నలుగురు యువకులు దోపిడీలకు పాల్పడుతూ చివరకు పోలీసులకు చిక్కారు. ఎల్లమ్మబండకు చెందిన ఈ యువకులు ఒకవైపు ఆటో నడుపుతూ, వెల్డింగ్ పనులు చేసుకుంటూనే జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం నేరాల బాట పట్టారు. గత నెల రోజులుగా ఉదయం మార్నింగ్ వాక్‌కు వెళ్లే మహిళలను లక్ష్యంగా చేసుకుని, ఒంటరిగా వెళ్తున్న వారి మెడలోని బంగారు గొలుసులను లాక్కొని పరారవుతున్నారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసిన జీడిమెట్ల పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితుల కదలికలను గుర్తించిన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నలుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి దోచుకున్న బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

# డేటా సెంటర్ల వెను రెండో కోణం...



ప్రస్తుత ప్రపంచంలో కృత్రిమ మేధ మౌలిక సదుపాయాలు కూడా రహదార్లు, ఓడరేవుల వంటి వ్యూహాత్మక జాతీయ ఆస్తులుగా మారుతున్నాయి. ఇటీవల విడుదలైన ఒక నివేదిక ప్రకారం, రాబోయే ఐదేళ్లలో భారతదేశంలోని డేటా సెంటర్లలో దాదాపు 7 లక్షల గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లను మోహరించే అవకాశం ఉంది. ఇది దాదాపు 23 బిలియన్ డాలర్ల పెట్టుబడి అవకాశాన్ని సృష్టిస్తుంది. దేశంలో ఎఐ స్వీకరణ, డేటా సెంటర్ల విస్తరణ అనేది ఒక భారీ ఆర్థిక అవకాశాన్ని తెరిచింది. 2025 లో 1.6 గిగావాట్ల (జిడబ్ల్యు)గా ఉన్న భారత్ నిర్మిత డేటా సెంటర్ సామర్థ్యం, 2030 నాటికి దాదాపు 5 జిడబ్ల్యుకు చేరుకుంటుందని అంచనా. దీని వలన దాదాపు 25 బిలియన్ డాలర్ల మూలధన పెట్టుబడి అవసరమవుతుంది. 2024లో 10 బిలియన్ డాలర్లుగా ఉన్న భారతదేశపు ఎఐ మార్కెట్, 39 శాతం సమ్మేళన వార్షిక వృద్ధిరేటు (సిఎజిఆర్)తో 2032 నాటికి 131 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని భావిస్తున్నారు. ఇతర అంచనాల ప్రకారం, కృత్రిమ మేధ భారత ఆర్థిక వ్యవస్థకు 2035 నాటికి 1.7 ట్రిలియన్ డాలర్లను జోడించగలదని ప్రభుత్వ అంచనా: ప్రస్తుతం భారతదేశపు టెక్నాలజీ రంగంలో 60 లక్షల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. గత పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం, 2024లో ప్రారంభించిన 'ఇండియా ఎఐ మిషన్' కింద ఇప్పటికే సుమారు 38,231 జిపియులు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ జిపియులు భారతీయ స్టార్టప్‌లు, అకాడమియాకు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉంచబడుతున్నాయి. ఇది కొత్త రకాల ఉద్యోగాల సృష్టికి అలాగే దేశీయ పరిశోధనలను ప్రోత్సహించడానికి దోహదపడుతుంది. ఎఐ యుగంలో జిపియులు పారిశ్రామిక యంత్రాలతో సమానంగా మారుతున్నాయి. పెద్దఎత్తున కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలకు లభ్యత కలిగిన దేశాలు ఎఐ మోడల్ డెవలప్‌మెంట్, డిఫెన్స్ టెక్నాలజీలు అలాగే ఎంటర్‌ప్రైజెస్, ఆటోమేషన్‌లో అసమాన ప్రయోజనాలను పొందగలవు. అదే సమయంలో, ప్రతి మౌలిక సదుపాయాల విస్తరణ వలే, ఎఐ డేటా సెంటర్లకు కూడా తీవ్రమైన సవాళ్లు ఉన్నాయి.

ఎఐ డేటా సెంటర్లు చాలా ఎక్కువ విద్యుత్తును వినియోగించుకుంటాయి. 2030 నాటికి భారతదేశంలో డేటా సెంటర్ లోడ్ 1.2 జిడబ్ల్యు నుండి 4.5 జిడబ్ల్యుకు అవసరమవుతుందని, ఎఐడ్రివెన్ ఫెసిలిటీలు మాత్రమే సంవత్సరానికి అదనంగా 40 50 టెరావాట్ గంటల (టిడబ్ల్యుహెచ్) విద్యుత్తును వినియోగించగలవని అంచనా. డేటా సెంటర్లు 2030 నాటికి భారతదేశం మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో దాదాపు 5 శాతాన్ని వినియోగిస్తాయని నివేదికలు హెచ్చరిస్తున్నాయి. దాదాపు 13.5 జిడబ్ల్యు వరకు ఎలక్ట్రిసిటీ డిమాండ్ ను చేరుకోవచ్చు. ప్రస్తుత ఎలక్ట్రిసిటీ గ్రిడ్‌పై ఈ ఒత్తిడి, భారీ స్థాయి విద్యుత్ కోతలకు లేదా వోల్టేజ్ అస్థిరతకు కారణం కావచ్చు. డేటా సెంటర్లు అధిక ఉష్ణోగ్రతను నియంత్రించుకోవడానికి భారీ మొత్తంలో నీటిని ఉపయోగిస్తాయి. 2024లో భారతదేశపు డేటా సెంటర్లు సుమారు 150 బిలియన్ లీటర్ల నీటిని వినియోగించుకున్నాయి. అలాగే 2030 నాటికి ఈ సంఖ్య 358 బిలియన్ లీటర్లకు దాదాపు రెట్టింపు లేదా మూడు రెట్లు అవుతుంది. ఒక్క డేటా సెంటర్ రోజుకు సుమారు 20 లక్షల లీటర్ల నీటిని ఉపయోగించే అవకాశం ఉంది. ఇప్పటికే తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్న భారతదేశంలో, ఇది స్థానిక జలాశయాలను మరింత దెబ్బతీస్తుంది. పెద్ద నగరాల్లో డేటా సెంటర్లు కేంద్రీకృతమై ఉండటం వలన ఈ నీటి సంక్షోభం మరింత తీవ్రమవుతుంది. కార్బన్ ఉద్గారాలతోపాటు, ఇంకా పర్యావరణానికి ఇతర నష్టాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఇ వేస్ట్ ఉత్పత్తి చేసే దేశం. జిపియులు అలాగే ఎఐ హార్డ్‌వేర్ ర్యాపిడ్ రీప్లేస్‌మెంట్ ఎలక్ట్రానిక్ వేస్ట్ సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. అంతేకాకుండా, దక్షిణాసియాలో చాలా వరకు ఎఐ విస్తరణ దృశ్యాలు ఇప్పటికీ స్థిరత్వ పరిగణనలను పూర్తిగా విడిచిపెడుతున్నాయి. ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోని 20 శాతం డేటాను సృష్టిస్తుండగా, ప్రపంచంలోని డేటా సెంటర్లలో కేవలం 3 శాతం మాత్రమే ఇక్కడ ఉన్నాయి. ఇది పెద్ద వృద్ధి అవకాశాన్ని సూచిస్తుంది. కానీ భారీ మౌలిక సదుపాయాల పెట్టుబడులు అవసరమవుతాయి. వాణిజ్య దృక్కోణం నుండి, ఇది లాభదాయకంగా కూడా ఉంటుంది. పెద్ద స్థాయి జిపియు మోహరింపులు 25.5 శాతం నుండి 28 శాతం వరకు అంతర్గత రాబడి రేటును సృష్టించగలవు. ఇది పెట్టుబడిని ఆకర్షిస్తుంది. వచ్చే ఐదేళ్లలో దేశంలో డేటా సెంటర్ కెపాసిటీ సుమారు 1.6 జిడబ్ల్యు నుండి 5 జిడబ్ల్యుకు చేరుకోబోతోంది. ఇది పెట్టుబడిదారులు అలాగే టెక్నాలజీ సంస్థలకు ఒక సువర్ణ అవకాశం కూడా. మరిన్ని కనుగొనండి బ్రేకింగ్ న్యూస్ అలర్ట్స్ జాతీయ వార్తలు వార్తల వీడియోలు భారతదేశం తన డేటా సెంటర్ సామర్థ్యాన్ని విస్తరించడం ద్వారా తన కృత్రిమ మేధ లక్ష్యాలను సాధించాలనుకుంటోంది. ఇది అమలు చేయబడిన భారీ పెట్టుబడులు నిస్సందేహంగా ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింపజేస్తాయి, సాంకేతిక రంగాన్ని ముందుకు నడిపిస్తాయి. అయితే, దీని కోసం అధిక విద్యుత్, భారీ మొత్తంలో నీటి వినియోగం వల్ల కలిగే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడం చాలా అవసరం. భారతదేశం 2030 నాటికి 50 శాతం పునరుత్పాదక ఇంధన లక్ష్యాన్ని చేరుకున్నప్పటికీ, ఎఐ వృద్ధి ఆ ఇంధన పునాదులను పరీక్షించనుంది. అదే విధంగా, తీవ్ర నీటి కొరత ఉన్న దేశంలో, సాంప్రదాయ జల శీతలీకరణ ప్రత్యామ్నాయాలు ఇకపై సాధ్యం కాకపోవచ్చు. అలాగే, నివేదికల ప్రకారం, ప్రస్తుతం రాష్ట్ర స్థాయి డేటా సెంటర్ విధానాలలో సస్టెనబిలిటీ ప్రొవిజన్లు చాలా తక్కువగా ఉన్నాయి. భారతదేశం విజయం సాధించాలంటే, ఈ అంతరాలను వెంటనే పూడ్చుకోవాలి.

## చెత్త నుంచి విద్యుత్తు

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. కొండవీడులోని జిందాల్ ప్లాంట్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన చెత్త నుంచి విద్యుత్తును తయారు చేసే ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రస్తుతం రాష్ట్రంలో రోజువారీ 7,200 టన్నుల పొడి చెత్త ఉత్పత్తి అవుతోందని, దీన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటే ఇంధన అవసరాలు తీరడంతో పాటు పర్యావరణం కూడా పరిరక్షించబడుతుందని అన్నారు. కొండవీడు ప్లాంట్ ద్వారా ఇప్పటికే 20 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా, విశాఖలో 15 మెగావాట్లు ఉత్పత్తి అవుతోందని.. ఇదే తరహాలో కాకినాడ, నెల్లూరు, కడప, కర్నూలు, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో మరో 6 ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని వెల్లడించారు. రానున్న గోదావరి పుష్కరాల నిర్వహణలో చెత్త, కాలుష్య నిర్వహణపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. పుష్కరాలతో నేరుగా సంబంధం ఉన్న 268 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక వర్క్ షాపులు నిర్వహించి అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. నదిలోకి ఎటువంటి వ్యర్థాలు చేరకుండా జిందాల్ అనుసరిస్తున్న ఆధునిక విధానాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తామన్నారు. నదిని అందంగా, పవిత్రంగా ఉంచేందుకు పంచాయతీలను భాగస్వామ్యం చేస్తూ, నిపుణుల సూచనలతో పక్కా ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. చెత్త సేకరణ నిర్వహణలో ప్రపంచ దేశాలు, ఇతర రాష్ట్రాల విజయగాథలను ఏపీలో అమలు చేయాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. సింగపూర్‌లో 90 శాతం చెత్తను కాల్చి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాన్ని, అలాగే దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా పేరొందిన మధ్యప్రదేశ్ లోని ఇండోర్ మున్సిపల్ మోడల్‌ను ఆయన ప్రస్తావించారు. ప్రతి 100 కిలోమీటర్లకు ఒక వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంటును ఏర్పాటు చేయడం ద్వారా మున్సిపాలిటీలతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని చెత్తను కూడా సులభంగా ప్రాసెస్ చేయవచ్చని, తద్వారా రాష్ట్రాన్ని డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా మార్చవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్లాంట్ల ఏర్పాటు కేవలం పారిశుధ్యానికే పరిమితం కాకుండా, ఆర్థిక ప్రయోజనాలను కూడా కల్పిస్తుందని పవన్ కళ్యాణ్ వివరించారు. ఒక మెగావాట్ విద్యుత్ తయారీ ప్లాంట్‌కు సుమారు రూ. 25 కోట్ల ఖర్చు అవుతుందని, దీనివల్ల స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అలాగే చెత్తను వేరు చేయడం ద్వారా పంచాయతీలు అదనపు ఆదాయాన్ని పొందే మార్గాలను అన్వేషించాలని సూచించారు. పూలు, పండ్లు, ఆహార వ్యర్థాల ద్వారా బయో గ్యాస్ ఉత్పత్తి చేసే బయో మిథలైజేషన్ ప్లాంట్లపై కూడా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. "చెత్తను వేరు చేయడంపై ప్రజల్లో అవగాహన రావాలి" అని పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. ప్రతి గ్రామంలో క్లస్టర్ల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని అధికారులను కోరారు. జిందాల్ ప్లాంట్ ఆపరేషన్స్ హెడ్ ఎం.వి. చారి రూపొందించిన ప్రత్యేక నివేదికపై త్వరలోనే పూర్తిస్థాయి ప్రెజెంటేషన్ ఇవ్వాలని పవన్ కోరారు.

## విశ్వ గురువు అంటారు

కానీ ఒక్కటి కూడా నిజాయితీగా, సరిగ్గా జరగలేదు" అని రాహుల్ గాంధీ విమర్శించారు. రాహుల్ గాంధీ ఎక్స్ ఖాతాలో ఇలా పోస్ట్ చేశారు. 'తాము విశ్వగురువు అని క్లెయిమ్ చేసుకుంటారు. కానీ దేశంలో ఒక పరీక్షను కూడా సరిగ్గా నిర్వహించలేరు. ప్రధాని నరేంద్ర మోదీ మొత్తం విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నారు. మీరు ఏ తరం భవిష్యత్తును నాశనం చేస్తున్నారో అదే తరం మీ లెక్క తేలుస్తుంది' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. CUETUG 2026 పరీక్ష సమయంలో దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో టెక్నికల్ ప్రాబ్లమ్ వచ్చింది. దీని కారణంగా సీయూఈటీ పరీక్ష నిర్ణీత సమయం కంటే ఆలస్యంగా ప్రారంభమైంది. సాంకేతిక సమస్యను పరిష్కరించామని, ఏ అభ్యర్థికీ నష్టం జరగకుండా విద్యార్థులకు ఎగ్జామ్‌కు పూర్తి సమయం ఇచ్చామని NTA ఓ ప్రకటనలో తెలిపింది. ఇటీవల NEET యూజీ, CBSE, SSC లకి సంబంధించిన వివాదాల తర్వాత CUET యూజీ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణలో సైతం జరిగిన ఆలస్యం పరీక్షా విధానంపై మరోసారి చర్చకు దారితీసింది. ప్రతిపక్షాలు మరోసారి ఎన్డీయే ప్రభుత్వం, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ నుంచి దీనిపై సమాధానం కోరుతున్నాయి. అయితే పరీక్ష ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు NTA పేర్కొంది.

ఎన్టీఏ క్లారిటీ

ఉదయం షిఫ్ట్ విద్యార్థులకు ఎగ్జామ్ రాసేందుకు పూర్తి సమయం ఇచ్చామని, ఏ విద్యార్థికి నష్టం జరగనివ్వలేదని NTA క్లారిటీ ఇచ్చింది. విద్యార్థులు, తల్లిదండ్రులకు కలిగిన అసౌకర్యానికి ఎన్టీఏ విచారం వ్యక్తం చేసింది. అలాగే సహాయం కోసం హెల్ప్‌లైన్ నంబర్ 911140759000, ఈమెయిల్ ఐడి cuetug@nta.ac.in లో సంప్రదించాలని సూచించింది. CUETUG పరీక్షకు భారీ సంఖ్యలో విద్యార్థులు హాజరుకావడం, వివిధ సబ్జెక్టుల కాంబినేషన్ల కారణంగా పరీక్షా షెడ్యూల్ ఎక్కువగా ఉంటుంది. అందుకే ఈ పరీక్షను పలు రోజులు, పలు షిఫ్టులలో నిర్వహించనున్నారు. ఈ ఏడాది మే 11న CUETUG 2026 పరీక్ష ప్రారంభం కాగా, మే 31 వరకు నిర్వహించనున్నారు.

## నిప్పుల కొలిమిలా తెలంగాణ

పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. జూన్ 1వ తేదీ తర్వాతే ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయని వెల్లడించింది.తెలంగాణ రాష్ట్రంలో భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. వేసవి తీవ్రత రోజురోజుకూ ఎక్కువవుతుండటంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. రాష్ట్రంలోని దాదాపు పది జిల్లాల్లో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటి దూసుకుపోతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. శుక్రవారం నమోదైన గణాంకాల ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా దహెగాంలో అత్యధికంగా 46.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ ప్లానింగ్ సొసైటీ అందించిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, పెద్దపల్లి జిల్లా రామగుండం ప్రాంతాల్లో 46.2 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదై ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశాయి.రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో 45.6 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ధర్మపురిలో 45.4 డిగ్రీలు, సూర్యాపేట జిల్లా మునగాలలో 45.4 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అలాగే ఖమ్మం, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్, ములుగు జిల్లా వెంకటాపూర్, వరంగల్ జిల్లా సంగెం ప్రాంతాలలో సైతం రికార్డు స్థాయిలో 45.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ భారీ ఉష్ణోగ్రతలకు తోడు తీవ్రమైన వడగాలులు తోడవడంతో రోడ్లన్నీ మధ్యాహ్నం వేళ జనసంచారం లేక కర్ఫ్యూను తలపిస్తున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది జిల్లాల్లోని సుమారు 46 మండలాల్లో వడగాలులు తీవ్ర ప్రభావం చూపించాయి. అత్యధికంగా మంచిర్యాల జిల్లాలోని 9 మండలాల్లో వడగాలులు వీయగా.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 8 మండలాలు, పెద్దపల్లిలో 7, నిర్మల్‌లో 6, జగిత్యాలలో 5 మండలాల్లో తీవ్రమైన వేడి గాలులు జనాన్ని అల్లాడించాయి. వీటితో పాటు ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో చెరో 3 మండలాల్లో, ములుగు జిల్లాలోని 2 మండలాల్లో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంది. శనివారం కూడా ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రత్యేకంగా హెచ్చరికలు జారీ చేసింది.మరోవైపు, ఈ తీవ్రమైన ఎండల కారణంగా రాష్ట్రంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఉష్ణోగ్రతల తట్టుకోలేక, వడదెబ్బ తగిలి శుక్రవారం ఒక్కరోజే వివిధ జిల్లాల్లో తొమ్మిది మంది మృతి చెందారు. ప్రజలకు ఉపశమనం కలిగించేలా వాతావరణ శాఖ ఒక సానుకూల వార్తను కూడా అందించింది. రాబోయే ఒకటి రెండు రోజుల పాటు తీవ్రమైన వడగాలుల పరిస్థితులు ఉంటాయని హెచ్చరించినప్పటికీ ఆదివారం నుంచి వాతావరణంలో మార్పులు వస్తాయని పేర్కొంది. ఆదివారం ఉత్తర, దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. దీనివల్ల వచ్చే నెల ఒకటో తేదీ తర్వాత నుంచి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పడతాయని అప్పటివరకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని అధికారులు సూచించారు.

# వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కో-ఆపరేటీవ్ సంస్థ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 29 :**




వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వికలాంగుల చట్టాలు, సంక్షేమ పథకాలపై తెలంగాణ రాష్ట్ర సదస్సు యాదగిరిగుట్ట లోని లక్ష్మి నరసింహ ఫంక్షన్ హాల్లో జరిగింది. విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల ప్రారంభ సూచికంగా సంఘం జెండాను రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ ఆవిష్కరణ చేశారు. సెమినార్ ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కోఆపరేటివ్ సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. విద్యా,ఉద్యోగాల్లో రిజర్వేషన్స్ అమలు చేయడం ద్వారా వికలాంగులకు ఉపయోగపడుతుందని, ఉన్నత విద్యా సంస్థల్లో ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నమని తెలిపారు. 3.75 కోట్ల నిధులతో 80 వేల మంది వికలాంగుల తో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి వికలాంగులకు ఆర్థిక సాధికారత కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.



తెలంగాణ రాష్ట్రంలో 4,372 మంది వికలాంగుల కు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడం జరిగిందని, రెండో దఫా ఇందిరమ్మ ఇండ్లలో 5 శాతం వికలాంగులకు కేటాయించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కోర్ట్ ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్ అమలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. 6 ఏండ్ల లోపు చిన్నపిల్లలకు అంగవైకల్యం ఉంటే బాల భరోసా పథకం ద్వారా ప్రభుత్వం ఉచితంగా ఆపరేషన్ చేస్తున్నామని అన్నారు. స్వయం ఉపాధి చేసుకుంటున్న వికలాంగులకు చదువుతో నిమిత్తం లేకుండా రిట్రోఫిట్టెడ్ వెహికల్స్ ఇస్తున్నామని, వికలాంగులకు సహాయ పరికరాలు అందించడం జరుగుతుందని అన్నారు. వికలాంగులపైన దాడులు, దౌర్జన్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వికలాంగులకు అందచేయడం మొదటి ప్రాధాన్యతగా ప్రభుత్వం చూస్తుందని, జూన్ 2 న తెలంగాణ రాష్ట్రంలోని 2 లక్షల మందికి చేయూత పెన్షన్స్ అందచేస్తున్నామని తెలిపారు. పేస్ రికగానేషన్ పేరుతో అర్హులు పెన్షన్స్ రద్దు చేస్తే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో వికలాంగుల నామినేటెడ్ పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు సూర్పంగ ప్రకాష్, కార్యదర్శి వనం ఉపేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి, కోశాధికారి కొత్తలలిత, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరాజు గౌడ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ముత్యాలు, ఎన్ పీఆర్ డీ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ రాజు, యశోద,నాగలక్ష్మి, కాషాప్పలతో పాటు వివిధ జిల్లాలనాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## వేద పండితులు వేద ఆశీర్వచనం

- యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కో-ఆపరేటీవ్ సంస్థ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య దంపతులు

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 30:**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కోఆపరేటీవ్ సంస్థ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కోఆపరేటీవ్ సంస్థ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రి క్షేత్రాన్ని దర్శించుకున్న సాంప్రదాయబద్ధంగా ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతించి ప్రత్యేక దర్శనం కల్పించగ స్వయంభు నరసింహ స్వామిని దర్శించుకున్న ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు లడ్డు ప్రసాదం జ్ఞాపికను అందజేశారు. శ్రీ లక్ష్మి స్వామి వారిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కోఆపరేటీవ్ సంస్థ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య కుటుంబ సభ్యులు కొండపైన గల శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వర స్వామిని శివాలయ దర్శనం కూడా చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట దివ్యాంగులు కొణదేల నరేష్, అనుంతుల ఎల్లారెడ్డి, వంగాల రమేష్, ఎర్ర వీరయ్య, జాలపు సిద్ధారెడ్డి, ఈశ్వర్ రాజు తదితరులు పాల్గొన్నారు.




## రాజస్థాన్‌లో ఇసుక తుపాను బీభత్సం

**జయభేరి, న్యూ ఢిల్లీ మే 30 :**

రాజస్థాన్‌లో ఇసుక తుపాను బీభత్సం సృష్టించింది. చురు, బికనేర్ ప్రాంతాలను ఇసుక తుపాను అతలాకుతలం చేసింది. సునామీ తరహాలో భారీ ఈదురు గాలులతో నివాస ప్రాంతాలను ఇసుక ముంచెత్తింది. ఇసుక తుపానుకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తుపాను ధాటికి పట్టపగలే చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. ఇసుక తుపాను అనంతరం కొన్నిచోట్ల భారీ వర్షం కురిసింది. రాజస్థాన్‌లోని చురు, బికనేర్ ప్రాంతాల్లో వాతావరణం అకస్మాత్తుగా మారిపోయింది. ఆకాశాన్ని భారీ ధూళి మేఘాలు కమ్మేయడంతో పట్టపగలే రాత్రిని తలపించింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో భయంకరమైన ఇసుక తుఫాను విరుచుకుపడింది. సుడిగాలిలా చెలరేగిన భారీ ధూళి మేఘాలు ఆకాశాన్ని పూర్తిగా కప్పేశాయి. విపరీతమైన వేగంతో గాలులు వీయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్లపై కొద్ది మీటర్ల దూరం కూడా కనిపించని పరిస్థితి నెలకొనడంతో వాహనాలు హెడ్‌లైట్ల సాయంతో మెల్లగా కదిలాయి.

## భారీ కుట్ర భగ్నం



**జయభేరి, ముంబై, మే 30 :**

దేశంలో భారీ ఉగ్రవాద కుట్రను ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్ భగ్నం చేసింది. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ తోనూ, పరారీలో ఉన్న గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీంతోనూ సంబంధాలున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఢిల్లీ, ముంబై సహా దేశంలోని పలు ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించేందుకు వీరు పథకం రచించినట్లు తెలిపారు.దేశంలోని అణు కేంద్రాలు, విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, విద్యుత్ ప్లాంట్లు, భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దాడులకు ప్లాన్ చేసినట్లు అధికారులు గుర్తించారని తెలుస్తోంది. అరెస్టయిన వారిలో ఢిల్లీ, ముంబై, పంజాబ్‌కు చెందినవారితో పాటు కొందరు విదేశీయులు కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి భారీ ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.గత కొంతకాలంగా ఈ ముఠాపై నిఘా పెట్టిన పోలీసులు, సరైన సమయంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఉగ్ర ముఠాకు సరిహద్దు ఆవల నుంచి అందుతున్న సహకారం, నిధుల సమీకరణ, విదేశీ హ్యాండ్లర్ల పాత్రపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల ఉగ్రవాద దాడుల హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీలో హై అలర్ట్ కొనసాగుతోంది.

# విద్య, పునరావాస సేవలు, ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలపైన సంతృప్తి

- దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 29 :**



యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామంలో దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు అందిస్తున్న సేవలు, కల్పిస్తున్న వసతులు, మౌలిక సౌకర్యాలపై అక్కడి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కేంద్రంలోని ఎంతమంది పిల్లలు ఆశ్రయం పొందుతున్నారు. వారి వయస్సు ఎంత,పిల్లల సంరక్షణ,ప్రత్యేక శిక్షణ కోసం ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారనే వివరాలను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. పిల్లలకు అందిస్తున్న విద్య, పునరావాస సేవలు,ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. నూతన భవన పనుల వేగవంతానికి ఆదేశం కేంద్రం కోసం నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణ పనులను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణం ప్రస్తుతం ఏ దశలో ఉందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం లోపే భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కేంద్రానికి ఇంకా ఏవైనా అదనపు సదుపాయాలు అవసరమైతే తమ దృష్టికి తీసుకురావాలని, వాటన్నింటినీ కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పునరావాస కేంద్రం నుండి పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ఉత్తీర్ణత సాధించిన ఒక దివ్యాంగ విద్యార్థిని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేకంగా అభినందించారు. ఆమెకు మిఠాయి తినిపించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీఓ) నాగిరెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు, కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎవరీ కులం ఎంతో.. వారికీ అంతా వాటా కావాలి

- బీసీ, ఎస్సి, ఎస్టీ (జె ఏ సి ) రాష్ట్ర కార్యదర్శి గుడిసె బాలయ్య ముదిరాజ్
- దేవరకద్ర లో వాల్ పోస్టర్ ఆవిష్కరణ


**జయభేరి, దేవరకద్ర :**




ఎవరీ కులం ఎంతో వారికీ అంతా వాటా కోసం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం లో జరిగే భారీ బహిరంగ కు దేవరకద్ర నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో కదిలి రావాలని బీసీ, ఎస్సి, ఎస్ టి (జె ఏ సి )రాష్ట్ర కార్యదర్శి గుడిసె బాలయ్య ముదిరాజ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన దేవరకద్ర కేంద్రంలో జె ఎసి బహిరంగ సభ వాల్ పోస్టర్ ను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్టంలో ఎవరీ కులం ఎంతో వారికంతా వాటా రావాలని ఆయన డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం రాజ్యాధికారం కోసం 90 శాతం ఉన్నా బిసి, ఎస్సి, ఎస్ ఎస్టీ ప్రజలు ఏకమై సాధించు కుందామన్నారు. రాష్టంలో రెండు, మూడు కులాల నాయకత్వం అధికారంలో ఉంటూ బీసీ, ఎస్సి, ఎస్ టి లను అనగదొక్కు తున్నారన్నారు. వారి రాజ్యాంగ హక్కులను కూడా కాలరస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం లేదని విమర్శలు చేశారు. బీసీ లకు రాజకీయ వాటా కావాలని డిమాండ్ చేశారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం లోని జూన్ 14న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం లో జరిగే బహిరంగ సభ కు జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు, కుల సంఘాల నాయకులు, మేధావులు,విద్యార్థి సంఘాల నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కే. శ్రీనివాస్ ముదిరాజ్, టి. సత్యనారాయణ, గణేష్ ముదిరాజ్, వి. హన్మంత్, ఎస్, సత్యనారాయణ, రాము, జగన్, రిటర్డ్ ఏ ఎస్ ఐ వెంకటయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**జయభేరి, తుర్కపల్లి, మే 30 :**



తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామానికి చెందిన చిన్నూరి భాను ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆయన కుటుంబానికి 5000 రూపాయలు, గ్రామానికి చెందిన గోర్ల లక్ష్మి అనారోగ్యంతో మరణించడంతో ఆమె కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని మాజీ సర్పంచ్ పోగుల ఆంజనేయులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మృతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

- మజ్జిగ కేంద్రం నిర్వహించిన సిఐటియు నాయకులు




**జయభేరి, పరవాడ:**

మండల కేంద్రమైన పరవాడ సినిమాలు జంక్షన్లో సిఐటియు ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సిఐటియు జెండాను సిఐటియు నాయకులు కన్నూరు. నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మజ్జిగకేంద్రం ఏర్పాటు చేశారు. సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గనిశెట్టి .సత్యనారాయణ మాట్లాడుతూ సిఐటియు 53వ ఆవిర్భావ దినోత్సవం గొప్ప విషయం అన్నారు. సిఐటియుకి విశేషమైన చరిత్ర ఉందన్నారు. ఐక్యపోరాటాల ద్వారా కార్మిక హక్కులను అనేక విజయాలను సాధించిన చరిత్ర ఉందన్నారు. శ్రమజీవులు ఆకుల కోసం సమానత్వం కోసం సామ్యవాద సమాజం కోసం సిఐటియు పనిచేస్తుందన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. 53వ ఆవిర్భావ దినోత్సవం భవిష్యత్ కార్మిక హక్కుల కోసం మరిన్ని సమరసియాల పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీను, లచ్చి బాబు, సన్యాసి నాయుడు, రమణ, అప్పారావు, గురునాధరావు, తదితరులు పాల్గొన్నారు.

## మోటర్ పంప్ ను ప్రారంభించిన ప్రభుత్వ విప్



**జయభేరి, తుర్కపల్లి, మే 30 :**

తుర్కపల్లి మండలం మల్కాపురం గ్రామంలో పోచమ్మ గుడి వద్ద గల బోరు కు బిగించిన మోటర్ పంప్ సెట్ ను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్ ,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాలా భాస్కర్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి పలుగుల శ్రీనివాస్, సర్పంచ్ సోన్నాయిల రఘు, ఉపసర్పంచ్ ఆకుల బాలయ్య, వార్డు సభ్యులు పిడుగు కావ్య కరుణాకర్, తోడేటి సత్యనారాయణ, తిరుమని నరేష్, సొల్లేటి రాజు, గ్రామస్తులు గోనె మధు, తోడేటి శ్రీరాములు, ఆనందచారి, పిడుగు శ్రీను, పిడుగు కిష్టయ్య, వెంకటేష్ ,మేకల సుధాకర్ పాల్గొన్నారు.



## నూతన అర్డిఓ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్ఎఫ్ఐ నాయకులు

**జయభేరి, పరకాల, మే 30:**

శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరకాల పట్టణం నూతనంగా వచ్చిన అర్ డి ఓ వెంకన్న ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అనంతరం విద్యా రంగ సమస్యలపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది. పరకాల పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల సమస్యలు పరిష్కరించాలని, శిధిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు నూతన బిల్డింగ్ నిర్మించాలని, పరకాల పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు అందించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్ జిల్లా కమిటీ సభ్యుడు హేమంత్, పట్టణ కార్యదర్శి సాయి తేజ, ప్రవీణ్, బన్నీ తదితరులు పాల్గొన్నారు

## మహిళల సమస్యల పరిష్కారానికి ముందడుగు జెండర్ రిసోర్స్ సెంటర్

- డిఆర్ డిఓ పిడి శేఖర్ రెడ్డి




**జయభేరి, దేవరకొండ :**

మహిళల సాధికారికతకు కృషి చేయడమే కాకుండా వారికి ఏ సమస్య వచ్చినా అండగా నిలిచేందుకు ప్రభుత్వం జెండర్ రిసోర్స్ సెంటర్లను చేపడుతుందని డిఆర్ డిఓ పిడి శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. 99 రోజుల ప్ర ప్రణాళికలో భాగంగా ప్రజా పాలన ప్రగతి నివేదిక సందర్భంగా డిఆర్డిఏ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కుటుంబ సలహా కేంద్రం జెండర్ రిసోర్స్ సెంటర్ ను దేవరకొండ పట్టణంలో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలు, సమాజంలో చోటు చేసుకుంటున్న పలు ఘటనాలతో అతివలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కలత చెందడం మినహా ఎవరికి చెప్పుకోలేక వారిలో వారే కుమిలిపోయి మానసికంగా కుంగి పోతున్నారని తెలిపారు. ఇలాంటి వారందరికీ జెండర్ రిసోర్స్ సెంటర్ ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. సమాజంలోని స్త్రీలు ఎవరైనా సరే ఈ కేంద్రాన్ని ఆశ్రయించి సాయం పొందవచ్చునని అన్నారు. అన్యాయానికి గురైన వారికి కౌన్సిలింగ్ ఇచ్చి సమస్యకు పరిష్కారం లభించే విధంగా సహకారం అందిస్తారని వివరించారు. కుటుంబ సమస్యలు, మహిళల హక్కులు, లింగ వివక్ష, గృహహింస, ఆరోగ్యం, పోషకాహారం పై ఉచితంగా న్యాయ, మానసిక సలహాలు అందించడమే ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశమని తెలిపారు, బాధితులు నేరుగా వచ్చి సేవలు పొందవచ్చునని సూచించారు. అలాగే 72 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన చెక్కును అందజేశారు. జెండర్ కమిటీ సభ్యులను, మండల సమాఖ్య ఓబీలను, వివో ఏ లను సన్మానించారు. అంతకుముందు స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి కోదాడ జడ్చర్ల జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దానియేలు, సీఐ వెంకట్ రెడ్డి, సెర్ప్ పీఎం లింగం గౌడ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, ఏపీఎం విజయలక్ష్మి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొర్ర రామ్ సింగ్ నాయక్, సిడిపిఓ చంద్రకళ, సీసీలు, జెండర్ కమిటీ సభ్యులు, వివో ఏలు, మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో హనుమాన్ నగర్ 9వ వార్డ్ లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక వారోత్సవం భాగంగా కౌన్సిలర్ ముత్యాల చంద్రకళ ఆధ్వర్యంలో మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న. వార్డ్ ఆఫీసర్ గౌతమి, ముత్యాల రవికుమార్ యాదవ్ , రూప్ల మహిళలు వార్డ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు గడ్డను సస్యశ్యామలం చేస్తాం

- ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి
- మంత్రి వాకిటి శ్రీహరి,ఎమ్మెల్యే జిఎంఆర్ లతో కలసి అజిలాపురం లిఫ్ట్ కు శంకుస్థాపన

**జయభేరి, దేవరకద్ర :**



పాలమూరు గడ్డను సస్యశ్యామలం చేస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి చరిత్రలో నిలిచిపోయేలా చేస్తామని ఆయన ప్రకటించారు.మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం అదవి ఆజిలాపురంలో దాదాపు 32.5 కోట్లతో చేపట్టే లిఫ్టు పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) తో కలిసి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి లతో కలిసి ఉత్తంకుమార్ రెడ్డి అజిలాపురం లిఫ్టు పనులకు భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఉత్తంకుమార్ రెడ్డి ప్రసంగించారు. సాగు రంగానికి పుష్కలంగా సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పలు పథకాలకు పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టిందన్నారు. రైతుల సంక్షేమానికి అహర్నిశలు ప్రభుత్వం పాటుపడు తుందన్నారు. ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... నెల్విడి, శ్రీ. కురుమూర్తి రాయ, సరళ సాగర్ ఎత్తిపోతల పథకాల మరమ్మత్తులకు నిధులు మంజూరు చేసినందుకు, అజిలాపూర్ లిఫ్ట్ మంజూరు చేసినందుకు గాను ఇరిగేషన్ శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలియజేశారు.అదే విధంగా కోయిల్ సాగర్ పెండింగ్ పనులకు 150 కోట్లు మంజూరు చేయాలని, చౌదర్ పల్లి లిఫ్టును మంజూరు చేయాలని, దానికి సంబంధించి ఇప్పటికే 87 కోట్ల రూపాయల నిధుల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. చౌదర పల్లి లిఫ్ట్ కు అనుమతులు ఇవ్వాలని, మంత్రిగని కోరారు. ఈ సందర్భంగా సానుకూలంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. అనంతరం ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ.... నీటిపారుదల రంగంలో ఈ టర్మ్ లో చరిత్రలో నిలిచిపోయేలా అద్భుతమైన పనులు చేస్తామన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వచ్చే నెల జూన్ 4, 5 తేదీలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను స్వయంగా పరిశీలిస్తామన్నారు. పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఎన్ని వేల కోట్ల రూపాయలైనా ఖర్చు పెట్టడానికి మా ప్రభుత్వం వెనకాడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.గత పాలకులకు కాళేశ్వరం ప్రాజెక్టుపై ఉన్న శ్రద్ధ.. పాలమూరు ప్రాజెక్టుల పై లేదని మండిపడ్డారు. పాలమూరు ఎత్తిపోతల పథకం 90 శాతం పూర్తయిందని బిఆర్ఎస్ నేతలు అబద్ధాలు చెప్తున్నారని ధ్వజమెత్తారు.జిల్లా ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ బిల్లులన్నింటినీ క్లియర్ చేసి, పనులను వేగవంతం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ టర్మ్ లోనే కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, పాలమూరు ఎత్తిపోతల పథకం తదితర పనులన్నింటినీ పూర్తి చేసి, పాలమూరు గడ్డను సస్యశ్యామలం చేస్తామన్నారు. దానికి సంబంధించి అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేస్తామని మంత్రి జిల్లా ప్రజలకు భరోసా ఇచ్చారు.అనంతరం చిన్నరాజమూర్ సమీపంలో వరి కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్ తో కలిసి మంత్రి పరిశీలించి, కొనుగోలు ప్రక్రియపై రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియపై రైతుల హర్షం వ్యక్తం చేసి, నిరంతరం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించిన ఎమ్మెల్యే కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా తో పాటు జిల్లా, మండల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా సైకిల్ యాత్ర

**జయభేరి, తుర్కపల్లి, మే 30 :**



పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా సైకిల్ యాత్రను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణం నుండి తుర్కపల్లి మండల కేంద్రం వరకు పెట్రోల్ డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా సైకిల్ యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై పెరుగుతున్న ఇంధన భారాన్ని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాదగిరిగుట్ట మండలం మల్లాపురం నుండి తుర్కపల్లి మండలం దత్తాయపల్లి, వెంకటాపురం గ్రామాల మీదుగా తుర్కపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో దాన్యం నిలువలు అధికంగా ఉండటం లారీల సమస్య రైతులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని పరిశీలించారు. దాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని జూన్ రెండవ తేదీ వరకు ఏ దాన్యం కొనుగోలు కేంద్రాల్లో దాన్యం కనిపిస్తే అధికారులపై చర్యలు తప్పవని అన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెంటనే లారీలను ఏర్పాటు చేసి దాన్యం గోదాములకు తరలించే చర్యలు చేపట్టాలని సూచించారు. అమాలీ కార్మికులను ఇతర ప్రాంతాల నుండి తుర్కపల్లి మండలానికి తరలించి దాన్యం లోడింగ్ పనులు ఇగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. వెంకటాపురం గ్రామ సమీపంలో మిషన్ భగీరథ ప్రధాన పైప్ లైన్ కు నాలుగు నుండి ఐదు చోట్ల లీకేజీలు ఉన్న విషయాన్ని గుర్తించారు. వెంటనే తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్కతో ఫోన్లో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు.

ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా వృథా అవుతున్న నీటిని అరికట్టేందుకు వెంటనే మరమ్మత్తు పనులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి సీతక్క తక్షణమే అధికారులకు ఆదేశాలు జారీచేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ప్రజలు తమ గ్రామాల్లో ఉన్న పలు సమస్యలను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దృష్టికి తీసుకొని వెళ్లగా ఆయన వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను త్రికరణ పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, సర్పంచులు జేరిపోతుల కరుణాకర్, కర్రే మాధవి కరుణాకర్ గౌడ్, సోమల వెంకటేశం, గుగులోతు ధూప్సింగు నాయక్, భూక్య రాజారాం నాయక్, ఉప సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, నాయకులు దేవరుప్పల ఐలయ్య, ధనావత్ భాస్కర్ నాయక్, దొమ్మాట బాబు, బానోతు వీరన్న నాయక్, బోరెడ్డి మహిపాల్ రెడ్డి, దొనికేన వెంకటేష్ యాదవ్, గడ్డమీది నిఖిల్ గౌడ్, ఎరుకల వెంకటేష్ గౌడ్, బాలు యాదవ్ , అరిగే మైపాల్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం

**జయభేరి, తుర్కపల్లి, మే 30 :**



తుర్కపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేయాలని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ గత 20 రోజులుగా రైతులు ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పోసి ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అంతర్జాతీయ పరిస్థితులు యుద్ధాల ప్రభావంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన విషయం ప్రజలకు తెలుసునని అన్నారు. బిజెపి పాలిత ప్రాంతాల్లో ఇంధన ధరలను పరిశీలించి తెలంగాణ ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో వ్యవహరించి వ్యాట్ తగ్గించి రాష్ట్ర ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి ప్రజా సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వం పైన చేస్తున్న అసత్య ప్రచారాన్ని మానుకోవాలని అన్నారు. కేవలం ప్రచార కార్యక్రమాలు, రీల్స్ రాజకీయాలు మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్, రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యవర్గ సభ్యుడు చాంద్ పాషా, జిల్లా మీడియా కో కన్వీనర్ బానోతు శంకర్ నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల రమేష్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బొల్లు నరసింహ యాదవ్, జిల్లా యువ మోర్చా కార్యదర్శి మేకల పాండు యాదవ్, గుండెబోయిన మల్లేశం, చిలుకూరి రమేష్ పాల్గొన్నారు.




## తెలంగాణ యువత భవిష్యత్తు ముఖ్యం

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్ భాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చర్చ గోష్ఠి కార్యక్రమనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రభుత్వ ప్రతినిధిగా మోతే శోభన్ రెడ్డి, హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ కాచం సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాచం సత్యనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులకు ఆత్మగౌరవం కావాలని, ఇండ్ల స్థలాల కోసం, పెన్షన్ల కోసమో తెలంగాణ ఉద్యమం జరగలేదని, భవిష్యత్తు తరాల కోసం నాటి తొలి దశ ఉద్యమం 1969 నుండి, మలిదశ ఉద్యమం 1996 వరకు కూడా, నీళ్లు, నియామకాలు, నిధుల గురించి జరిగిందని, గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా, చేసిందేమీ లేదని, పార్టీలు ముఖ్యం కాదని, తెలంగాణ యువత భవిష్యత్తు ముఖ్యమని, 1200 మంది త్యాగాల ఫలితమే, తెలంగాణ రాష్ట్రం, అన్ని వర్గాలు కూడా, కార్మిక కర్షక విద్యార్థి ఉద్యోగ, రాజకీయ డాక్టర్ ప్రొఫెసర్, ఇలా అన్ని రంగాల సంబంధించిన వాళ్ళు కలిసి పోరాడితేనే తెలంగాణ వచ్చిందని, పెన్షన్ ఇళ్ల స్థలాలు కావాలంటే, 25 ఏళ్లు ఉద్యమం చేయాల్సిన పనిలేదని, ఆస్తులు అమ్ముకోవాల్సిన పనిలేదని, ఉన్న డబ్బుతో ప్లాటుకొని ఇల్లు కట్టుకోవచ్చునని, అన్నారు, ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి, తెలంగాణ యువత, ఆత్మగౌరవం కాపాడాలని, తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని, అని అన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, శోభన్ రెడ్డి మాట్లాడుతూ.. గత పాలన కంటే తెలంగాణ రాష్ట్రం వచ్చాక కొంతమేరకు న్యాయం జరిగిందని, తెలంగాణ ఉద్యమకారుల కోసం ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేశామని, దీనికి ముఖ్యమంత్రి అధ్యక్షతన కొనసాగుతుందని, ఈ కమిటీలో మంత్రి పొన్నం ప్రభాకర్ తోపాటు అద్దంకి దయాకర్, ఇంకా కొంతమంది ఉండి ఉద్యమకారులను మొదట గుర్తించి, వారి సంక్షేమం కోసం త్వరలోనే ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక, ఉద్యమకారుల గురించి ఆలోచించి, ప్రత్యేకంగా వాళ్ల సంక్షేమం కోసం, విద్య వైద్యంలో తోపాటు, ప్రభుత్వ సదుపాయాలను కూడా ఏర్పాటు చేయాలని యోచిస్తుందని అన్నారు, త్వరలోనే తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులకు అనుకూలంగా, ఆత్మగౌరవం దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటుందని అన్నారు.

## సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

- చెంగిచెర్ల డిపో మేనేజర్ కే.కవిత

**జయభేరి, మేడిపల్లి :**

సరస్వతి పుష్కరాల కోసం వెళ్లే భక్తులకు స్పెషల్ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు చెంగిచెర్ల డిపో మేనేజర్ కే.కవిత తెలిపారు. కాళేశ్వరం, పుష్కరఘాట్, భద్రకాళి ఆలయం వంటి ప్రముఖ పుణ్య క్షేత్రాలకు పెద్దలకు రూ.1000, పిల్లలకు రూ.600గా నిర్ణయించినట్లు తెలిపారు. రేపు ఉదయం 7:00 గంటల నుంచి సర్వీసులు ఉంటాయని తెలిపారు. ఏవేని కాలనీ వాసులు 20,30 పుష్కరాలకు వెళుతామని తెలిపితే వారికోసం ప్రత్యేక బస్సు ను పైన్స్ పేర్కొన్న ఛార్జీలకే ఏర్పాటు చేయనున్నట్లు కవిత వివరించారు.మరిన్ని వివరాలకు 9110505820, 9948886516 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

